క్లుప్తంగా

ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు..



సీడీపీఓ రంగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

పాలకొండ: కార్యకర్తలకు అందించిన సెల్ ఫోన్లు ప్రభుత్వం తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు బి.అమరవేణి అన్నారు. ఈ మేరకు సీడీపీఓ రంగలక్ష్మిని శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమరవేణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన ఫోన్లు నాసిరకమైనవి.. వాటితో పని చేయడం ఇబ్బందిగా ఉందని చెప్పారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు కార్యకర్తలందరూ తమ సెల్‌ఫోన్లను అధికారులకు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెస్సీబాయ్, మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: వాహన చోదకులు రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పెట్రోల్‌బంక్ రహదారి పరిధిలో సిబ్బందితో కలిసి శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు రోడ్డు నిబంధనలను వివరించారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు.

చురుగ్గా క్లోరినేషన్ ప్రక్రియ



గుమ్మలక్ష్మీపురంలోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు క్లోరినేషన్ చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని రక్షిత మంచి పథకం ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ బి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో శనివారం క్లోరినేషన్ చేయించారు. క్లోరినేషన్ చేసిన నీటి సరఫరాపై నిర్వాహకులకు ఏఈ పలు సూచనలు చేశారు.

నివాళులు..



పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాఖా గ్రంథాలయ నిర్వాహకులు, విద్యార్థులు

గరుగుబిల్లి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకు శనివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పింగళి 149వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన జెండాను జాతీయ పతాకంగా గుర్తించండి గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమూనా చెక్ విడుదల



కురుపాంలో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నమూనా చెక్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎంపీడీఓ కార్యాలయం వద్ద శనివారం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి నియోజకవర్గంలోని 39,084 మంది రైతులకు మంజూరైన రూ.27.36 కోట్లకు సంబంధించిన నమూన చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ధర్మచంద్రారెడ్డి, ఏడీ అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ కద్రక కళావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

6న జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 6వ తేదీన పాలకొండలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నుండి 28 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పాలకొండ తమ్మి నాయుడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పొంచి ఉన్న వ్యాధుల భయం..

- అవగాహనతోనే జీవాలకు సంరక్షణ
- ప్రయోగశాలల్లో ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- విస్తృతంగా వ్యాక్సినేషన్



డీ వార్మింగ్ కార్యక్రమంలో భాగంగా జీవాలకు వ్యాధి నిరోధక మందులు అందిస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్:

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి వనరుల్లో చేరుతున్న కొత్త నీరు కారణంగా మూగజీవాలకు అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో జీవాలకు ఆశించే జబ్బవాపు, చిటుక వ్యాధి, గాలికుంటు, తదితర వ్యాధుల నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నారు. పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో గల మార్కెట్ యార్డులో వ్యాధి నిర్ధారణా ప్రయోగశాలల ద్వారా పశువులకు వైద్యపరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. జీవాలకు ఆశించే రోగాలపై అవగాహన కలిగి ఉంటే వాటిని సంరక్షించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

చిటుక వ్యాధి..

గొర్రెలలో చిటుకు వ్యాధి ఎక్కువగా కనిపిస్తోంది. బ్యాక్టీరియా వల్ల ఆశించే ఈ వ్యాధి వల్ల జీవాలు తూలుతూ నడుస్తాయి. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి చిటుకలో చనిపోతాయి కాబట్టే చిటుక వ్యాధి అంటారు. మందలో 10కి పైగా జీవాలు చనిపోతే చిటుకు వ్యాధి సోకినట్లుగా భావించవచ్చు. మందలో నీరసంగా ఉన్న గొర్రెలను మందల నుంచి వేరు చేయాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వేయించాలి. వ్యాధి సోకని జీవాలకు నివారణ వ్యాక్సిన్ వేయించాలి.

నీలినాలుక వ్యాధి..

నీలినాలుక వ్యాధి వైరస్ వల్ల ఇవి వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకల్లో జ్వరం తీవ్రత అధికంగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తాయి. గిట్టలకు పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోకుండా బలహీనంగా ఉంటాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు మంద నుంచి దూరంగా గుంపుగా ఉంటాయి. ఈ వ్యాధి నివారణకు యాంటీ బయోటిక్స్, లివర్ టానిక్ వేయాలి. వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి, మిగిలిన వాటికి టీకాలు వేయించాలి.

గొంతువాపు వ్యాధి..

గొంతువాపు వ్యాధి బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. ఈ వ్యాధి అన్ని వయసుల గేదెలు, ఆవుల్లో కనిపిస్తుంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే 105 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుతుంది. అదేవిధంగా నోటితో ఎక్కువగా గాలి పీల్చుకుంటాయి. నివారణకు సల్ఫాడిమిడిన్ మందు ఉపయోగించాలి. నాలుగు నెలలు దాటిన జీవాలకు కచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలి.

గాలికుంటు వ్యాధి....

ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి. ఇది ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఆశిస్తుంది. వ్యాధి లక్షణాల విషయానికి వస్తే నోరు, గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయి. జ్వరం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన చూడి పశువులు నాలుగైదు నెలల్లో ఈసుకుపోతాయి. నివారణకు బోరిక్‌రిన్ పేస్టును నోటి పుండ్లపై రాయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్టల మధ్య కడగాలి. యాంటీబయోటిక్ మందులు, లివర్ టానిక్ ఉపయోగించాలి. ప్రతీ ఏటా ఏప్రిల్, మే నెలల్లో వ్యాక్సిన్ చేయించుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..



వర్షాకాలంలో పశువుల పట్ల పాడి రైతులు తగు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. పోషణ అందించే దాణా అందుబాటులో ఉంచుకోవాలి. పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలి. ఎండిగడ్డి తడవకుండా చూడాలి. అన్ని జీవాలను ఒకే చోట గుంపుగా ఉంచరాదు. గాయపడిన జీవాలకు తక్షణమే వైద్య సేవలు అందించాలి. యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ అందుబాటులో ఉంచుకోవాలి. నిత్యం వ్యాక్సినేషన్ ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ఈ అవకాశాన్ని పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు, పాలకొండ

అతిథి బోధకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి అతిథి బోధకుల (మహిళలకు మాత్రమే) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీరసింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు పీజీటీ ఇంగ్లిష్-1, పీజీటీ బయాలజీ-1, టీజీటీ తెలుగు -1, టీజీటీ సైన్సు-1, టీజీటీ ఆర్ట్ టీచర్-1, హాస్టల్ వార్డెన్ (స్త్రీ)-1, హాస్టల్ వార్డెన్ (పురుషుడు)-1 భర్తీ చేయనున్నట్లు చెప్పారు. పీజీటీలకు నెలకు రూ. 35,000, టీజీటీలకు నెలకు రూ.33,000 చొప్పున జీతం అందజేస్తామన్నారు. www.emrrfpuram.orf.in వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల 10వ తేదీలోగా పాఠశాల ఆఫీస్‌లో అందజేయాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు...

గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్స్ సబ్జెక్టులకు గెస్ట్ లెక్చరర్ పద్ధతిలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలను కళాశాలలోని కార్యాలయానికి అందజేయాలని కోరారు. దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీన ఉదయం 10.30 గంటల కు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.

శ్మశానవాటికలో ఆక్రమణలు..



ఆక్రమణలపై స్థానికులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

వీరఘట్టం: మేజర్ పంచాయతీలోని రెల్లివీధి సమీపంలో ఉన్న శ్మశానవాటికలో ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. దీంతో స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు ఆదేశాల మేరకు ఆర్‌ఐ రవితేజ, వీఆర్‌ఓ బాసూరు శ్రీను, సర్వేయర్లు శ్రీనివాసరావు, కైలాసరావు శనివారం శ్మశానవాటికను సందర్శించి, ఆక్రమణలపై ఆరా తీశారు. కొలతలు వేయగా సుమారు 40 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తామని, వారి స్పందించని సమక్షంలో వారం రోజుల తర్వాత అధికారులు, స్థానికుల సమక్షంలో ఆక్రమణలు తొలగిస్తామని సర్వే అధికారులు తెలిపారు. అలాగే స్థానిక ఒట్టిగెడ్డ సమీపంలో సర్వే నంబర్ 409లో ఉన్న సుమారు 7.5 ఎకరాల శ్మశానవాటికలో కూడా ఆక్రమణలు జరిగాయని, అధికారులు సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరారు.

పరామర్శ



మొండెంఖల్లులో దీసరి రామన్నదొర కుటుంబాన్ని పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామానికి చెందిన దీసరి రామన్నదొర (వేణు) ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, మాజీ ఎంపీపీ అనిమి ఇందిరా కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సుజాత, కురుపాం మండలం కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మక వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి..



భామిని: తల్లిపాల వారోత్సవ ర్యాలీలో వైద్యాధికారి సోయల్, సీడీపీఓ శాంతి భవానీ, తదితరులు

పాలకొండ: బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లింగాల శాంతికుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఏలాం సెంటర్‌లో ఉన్న శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.



పాలకొండ: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ శాంతికుమారి

ముర్రుపాలు తప్పనిసరి..

భామిని: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పసుపులేటి సోయల్, సీడీపీఓ శాంతిభవానీ సూచించారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టి.. ముర్రుపాలు అమృతంతో సమానమని నినాదాలు చేశారు. అనంతరం పసుకుడి, గజపతినగరం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమాల్లో ఎస్‌ఓలు సుధారాణి, జ్యోతిలక్ష్మి, వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): బిడ్డకు తల్లి పాలే మేలని కురుపాం సీడీపీఓ జి.రజినీదుర్గ అన్నారు. కురుపాం అంగన్‌వాడీ కేంద్రం-3లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలుపుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లికి వచ్చే ముర్రుపాలను బిడ్డకు తప్పనిసరిగా పట్టాలని, ఆ పాలలో బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. బిడ్డకు కనీసం ఆరు మాసాలు నిండే వరకు తల్లిపాలే పట్టాలని, బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం రెండు సంవత్సరాల ఎడం పాటించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కురుపాంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

అధికారులు హాజరుకాకపోతే ఎలా..?



సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సభ్యులు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు

భామిని: మండల సర్వసభ్య సమావేశానికి రెవెన్యూ శాఖాధికారులు హాజరుకాకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన ఎంపీడీఓ వసంతకుమారి సారథ్యంలో జరిగిన మండల సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, పాత్రుకొండ రాంబాబు, తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. యూరియా పంపిణీ బాధ్యతను రైతుసేవా కేంద్రాలకు పూర్తిగా అప్పగించకుండా, ప్రైవేట్ డీలర్లకు ఇవ్వడం బాధాకరమన్నారు. చాలా చోట్ల ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విద్యుత్ కోతల వల్ల వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను నిలదీశారు. జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా సీసీ రోడ్ల మధ్యలో తవ్వడంపై ప్రత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు, తోట సింహాచలం అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈ సందీప్, కోఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వ్రతాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని పనుకువలస గ్రామంలో శనివారం సామూహిక వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేంకటేశ్వర స్వామి మహత్యాన్ని వివరిస్తూ, వ్రతాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని పూజించారు. దీనితో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన వాతావరణం నెలకొంది.

కూటమి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే కళావతి



బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

సీతంపేట: సూపర్‌సిక్స్ పేరు చెప్పి అన్ని వర్గల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కుశిమిలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన హామీల వివరాలు చూపించారు. సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని.. ఇప్పుడు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి వంటి పథకాల ఊసెత్తడం లేదని ఎద్దేవా చేశారు. ఇంటి ముంగింటకే వచ్చి ఇచ్చే రేషన్ బియ్యాన్ని రేషన్ డిపోలకు అప్పగించి ప్రజలందరినీ ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఇంటి వద్దే పింఛన్లు అందజేసే వలంటీర్లను తీసెయ్యడం వల్ల పెన్షన్ లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహనరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, ఎంపీటీసీ సభ్యులు గణేష్, హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, ఎన్.అబ్బాస్, చెంచయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొత్త బాధ్యతలు



పట్లాసింగి ఉమా మహేష్

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం పి.లేవిడి గ్రామానికి చెందిన పట్లాసింగి ఉమామహేష్‌ను రాష్ట్ర సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన గుమ్మలక్ష్మీపురంలో స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టిన పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

రైతుకు అండగా ఉంటాం..



అన్నదాత సుఖీభవ చెక్ రిలీజ్ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ: రైతులకు తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో నియోజకవర్గ స్థాయి అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. నియోజకవర్గంలో 33 వేల మంది రైతులకు రూ. 23 కోట్ల ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు. సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎ.డి రత్నకుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ బిడ్డిక సంధ్యారాణి, నాలుగు మండలాల ఏఓలు, కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, మారోజు తేజోవతి, గర్భాన సత్తిబాబు, జాడ శ్రీధర్, రాయి వనజ, వాకుముడి అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయరంగారావు, తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పార్వతీపురం టౌన్: జిల్లాలో ప్రభుత్వ మరియు ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అధికారి నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి దోషం వున్న విద్యార్థులకు ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. 15 మంది విద్యార్థులకు దృష్టి దోషం వున్నట్టు గుర్తించి వారికి త్వరలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామన్నారు.

స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్ ప్రారంభం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పీఓ, తదితరులు

సీతంపేట: స్పేస్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సమగ్రశిక్షా, మస్కాన్ సాయంతో ఏర్పాటు చేసిన స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్‌ను స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం మంచి అవకాశమన్నారు. ఈ క్యాంప్‌లో విద్యార్థినులకు టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వంటి ఆధునిక, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణరావు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీ ఈఓ రామ్మోహనరావు, ఎంఈఓ ఆనందరావు, ఏఎంఓ పి.కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

పాలకొండ రూరల్: మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలకు బానిస కాకుండా యువత సన్మార్గంలో నడవాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. శనివారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడున్న యువతతో మాట్లాడుతూ.. సమయం వృథా చేయకుండా చదువు, ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పోక్సో కేసుల్లో చిక్కుకున్న వారు ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. ఈయన వెంట ఎస్సై కె.ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.



కాలనీ పరిసరాల్లో పర్యటిస్తున్న సీఐ, ఎస్సై